బాలక్రిష్ణపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

లింగంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పీఎంపీల వద్ద డీఎంహెచ్‌వో పేరిట డబ్బులు వసూలు చేసిన బాలక్రిష్ణపై చర్యలు తీసుకోవాలని పీఎంపీలు డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. అధికారుల పేరు చెప్పి నకిలీ ఐడీకార్డుతో మోసం చేసి పీఎంపీల వద్ద రూ.25వేలు వసూలు చేసిన బాలక్రిష్ణపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పీఎంపీల అధ్యక్షుడు విఠల్, భీంరాజ్, రషీద్, భాస్కర్, మోహన్‌లతో పాటు పీఎంపీలు ఉన్నారు.



రాజంపేటలో రేషన్‌కార్డుల కోసం సర్వే నిర్వహిస్తున్న అధికారులు

గందరగోళంగా.. కొత్త రేషన్‌కార్డులు!

కామారెడ్డి టౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డుల జారీ విషయంలో గందరగోళం నెలకొంటుంది. గతంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం సంవత్సరం కింద నిర్వహించిన ప్రజాపాలనలో కొత్త రేషన్‌కార్డులకు దండిగా దరఖాస్తులు వచ్చాయి. సుమారు 40 వేలకు పైగా కొత్త రేషన్‌కార్డులకై దరఖాస్తులు రాగా ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో 21వేల దరఖాస్తులు ఉండడంతో జాబితాలో లేని వారు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం కొత్త రేషన్‌కార్డులకు క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం సర్వే నిర్వహిస్తోంది. గ్రామాలు, పట్టణాల్లో అర్హులైన వారికి కూడా ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు రాలేదని వాపోతున్నారు. తిరిగి గ్రామాల్లో కార్యదర్శులకు, పట్టణాల్లో మున్సిపల్ అధికారులకు రేషన్‌కార్డులకు వినతులు ఇస్తున్నారు. అయితే వాటన్నింటిని ఎప్పుడు పరిశీలించి వారందరికి కొత్త కార్డులు జారీ చేస్తారనే దానిపై స్పష్టత లేదు. ప్రజాపాలనలో 6 గ్యారెంటీల పథకాల అమలు కోసం దరఖాస్తులు స్వీకరించా రు. ఆ సమయంలోను తమకు రేషన్‌కార్డులు ఇప్పించాలని అనేక మంది దరఖాస్తులు పెట్టుకున్నా రు. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వే ఆధారంగా జాబితాను విడుదల చేసినట్లు తెలుస్తోంది. ఈ జాబితాలో చాలా మంది తమకు రేషన్‌కార్డులు లేవని వెల్లడించారు.

కుటుంబ సర్వే ఆధారంగా..

జిల్లాలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఆ సమయంలో తమకు రేషన్‌కార్డులు లేవని చెప్పిన వారి వివరాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 21,842 కుటుంబాలు ఉన్నట్లు తేలింది. ఈ జాబితా ఆధారంగానే ప్రస్తుతం అర్హుల గుర్తింపు కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన కొనసాగుతోంది. ప్రస్తుతం 15వేల దరఖాస్తుల సర్వే పూర్తిచేశారు. ఈ జాబితా ఆధారంగానే ప్రస్తుతం అర్హుల గుర్తింపు కోసం పరిశీలన జరుగుతుంది. అయితే ఇందులో సైతం అర్హులు తగ్గే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో సర్వేకు వెళ్లినప్పుడు జాబితాలో ఉన్న వారి ఆదాయం, భూ విస్తీర్ణం ఆధారంగా ఉండడంతో పాటు ఇంట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లోని ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగ పింఛన్‌దారులు ఉన్నారు. వీరందరిని మళ్లీ జాబితా నుంచి తొలగించాల్సి ఉంది. ఇక ప్రభుత్వం 10 ఏళ్ల కిందటి నాటి నిబంధనలే అమలు చేయడంతోను సమస్యలు వస్తున్నాయి. కుటుంబ ఆదాయం, ఆస్తులు, ఆయా గ్రామాల్లో ఉన్న అధికారులే క్షేత్రస్థాయిలో గుర్తించాల్సి ఉంది. బీపీఎల్‌కు దిగువన ఉన్నట్లు గుర్తించిన వారికే రేషన్‌కార్డులు అందే అవకాశం ఉంది. దీంతో చాలా మంది రేషన్‌కార్డులు వస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు.

- జిల్లాకు ప్రభుత్వం విడుదల చేసిన జాబితా ప్రకారం 21,842 దరఖాస్తులు
- గతంలో వచ్చినవి 40వేలకు పైనే..
- జాబితాలో సగానికి పైగా దరఖాస్తులు లేకపోవడంతో ఆందోళన
- అర్హుల జాబితాలో చేర్చాలని వినతులు
- ఇప్పటి వరకు 15వేలకు పైగా దరఖాస్తుల పరిశీలన
- కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ నిరంతర ప్రక్రియ అంటున్న అధికారులు

మార్పులు, చేర్పుల కోసం నిరీక్షణ

రేషన్‌కార్డుల్లో కుటుంబసభ్యుల పేర్ల నమోదు చేసేందుకు గత కొన్నేళ్లుగా అవకాశం లేకుండా పోయింది. అలాగే ప్రస్తుతం ఉన్న కార్డుదారులు వీడిపోయి వేరుపడిన వారికి కొత్త కార్డులు జారీచేయాలని చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇప్పటికీ వారికి కొత్త కార్డులు జారీకి అవకాశం లేకపోవడంతో కుటుంబాల వారిగా కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. రేషన్‌కార్డుల్లో కొత్త పేర్ల చేరిక, మార్పులు చేయడం దానిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదు. దీంతో కొత్త రేషన్‌కార్డులతో పాటు పాత కార్డుల్లో పేర్లు మార్పులు, చేర్పుల కోసం నిరీక్షిస్తున్న చాలా మందికి నిరాశే కలుగుతుంది.

పథకాలకు ప్రామాణికం రేషన్‌కార్డే..

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ పథకానికి రేషన్‌కార్డునే ప్రామాణికంగా మార్చడంతో కార్డు పొందాలనే ఆశలు అందరిలోను ఉన్నాయి. ఇటీవల పంటల రుణమాఫీ, గ్యాస్ సబ్సిడీ పథకాలతో పాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికతో ఇప్పటికే అమలు చేస్తున్న ఆరోగ్య శ్రీ వంటి వాటికి రేషన్‌కార్డు కీలకంగా మారింది. భవిష్యత్తులో అమలు చేయనున్న ఇతర సంక్షేమ పథకాలు సైతం రేషన్‌కార్డు ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారనే భావనతో చాలా మంది కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో కొత్త కార్డులు జారీ చేయకపోవడంతో సంవత్సరాలుగా వేలాది మంది వినతులు పెండింగ్‌లోనే ఉంటూ వచ్చాయి. వీటన్నింటిని మళ్లీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంది.

రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ : ఆశిష్ సాంగ్వాన్, కలెక్టర్

అర్హులైన ప్రతీ కుటుంబానికి రేషన్‌కార్డులు అందజేస్తాం. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ. ప్రస్తుతం గ్రామాల్లో, పట్టణాల్లో జరుగుతున్న రేషన్‌కార్డుల ప్రక్రియలో ఎవరిపేరైన లేనట్లయితే అనుమానాలు అవసరం లేదని ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ, వార్డుసభల్లో దరఖాస్తులు స్వీకరిస్తాం. రేషన్‌కార్డుల్లో వారివారి కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలని పెట్టుకున్న దరఖాస్తులను, పెట్టుకోబోయే వాటిని విచారించి తగు చర్యలు తీసుకుంటాం. రేషన్‌కార్డులు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందజేయడం అనేది నిరంతర ప్రక్రియ. ఎటువంటి ఆందోళన అవసరం లేదు.

మైనార్టీ గురుకులాల్లో.. ప్రవేశాలకు వేళాయే!

కామారెడ్డి టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల ఆర్థిక కష్టాలతో వారి పిల్లలను చదివించలేని పరిస్థితిలో ఉండడంతో పాటు తమతో పాటు పనికి తీసుకెళితే డబ్బులైనా వస్తాయనే ఆలోచన చేస్తు వారిని విద్యకు దూరం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులను దూరం చేసి నిర్భంద విద్యను అమలు చేసేలా మంచి భోజన సౌకర్యంతో పాటు వసతిని ఏర్పాటు చేసి సకల సౌకర్యాలతో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించాలన్న లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం మైనార్టీ గురుకులాలను ప్రారంభించి నాణ్యమైన విద్య అందేలా చూస్తోంది. ఇందుకు అనుగుణంగా ఉచిత విద్యతో పాటు వసతి కల్పించి విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చుతున్నారు. ప్రతీ ఏటా ఆయా తరగతులలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా మైనార్టీ పాఠశాల, కళాశాలల ప్రవేశాలకు ఈనెల 18 నుంచి దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించారు. ఫిబ్రవరి 28వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

జిల్లాలో 6 పాఠశాలలు, 6 కళాశాలలు

జిల్లాలోని మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతిలో మొత్తం సీట్లకు, 6,7,8 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయనున్నారు. జిల్లాలోని 6 పాఠశాలలు ఉండగా వీటిలో రెండు బాలికల (టీజీఎంఆర్ బాన్సువాడ, టీజీఎంఆర్ కామారెడ్డి), నాలుగు బాలుర(టీజీఎంఆర్ కామారెడ్డి, టీఎంఆర్ జుక్కల్, టీజీఎంఆర్ లింగంపేట, టీజీఎంఆర్ ఎల్లారెడ్డి) పాఠశాలలు ఉన్నాయి. 5వ తరగతిలో ఒక్కో పాఠశాలలో 40 సీట్ల చొప్పున 240 సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన తరగతుల్లో ఖాళీలకు అనుగుణంగా భర్తీ చేయనున్నారు. అలాగే జిల్లాలో 6 కళాశాలలు (టీజీఎంఆర్ బాలుర, కామారెడ్డి, టీజీఎంఆర్ బాలికల కామారెడ్డి, టీజీఎంఆర్ బాలికల బాన్సువాడ, టీజీఎంఆర్ బాలుర జుక్కల్/బిచ్కుంద, టీజీఎంఆర్ బాలుర లింగంపేట, టీజీఎంఆర్ బాలుర ఎల్లారెడ్డి)లో ఉండగా ఈ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ, సీఈసీ, ఒకేషనల్ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్) కోర్సులు ఉన్నాయి.

75 శాతం మైనార్టీలకు కేటాయింపు

మైనార్టీ పాఠశాల, కళాశాలల్లో ప్రవేశం కోసం విద్యార్థులు టీఎంఆర్ఈఐఎస్ తెలంగాణ.సీజీజీ.ఇన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు. 75 శాతం మైనార్టీలకు (64 శాతం ముస్లింలు, 7 శాతం క్రిస్టియన్లు, 4 శాతం పార్సీలు, జైనులు, సిక్కులు, బౌద్దులు) ఇతరులకు 25 శాతం సీట్లు నాన్ మైనార్టీ (ఎస్సీ 6 శాతం, ఎస్టీ 4 శాతం, బీసీ 12 శాతం, ఓసీ 3 శాతం) వర్గాలకు కేటాయించారు. వెబ్‌సైట్‌లో చూపినట్లు వివరాలు పొందుపరచాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల వారి వార్షికాదాయం రూ.2లక్షలలోపు ఉన్నవారే దరఖాస్తుకు అర్హులు. అలాగే 5వ తరగతిలో మొదట దరఖాస్తు చేసుకున్న మైనార్టీలకు సీట్లు కేటాయిస్తారు. ఇతర వర్గాల వారికి లక్కీడ్రా ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. 5,6,7,8 తరగతుల్లో మొదట దరఖాస్తు చేసుకున్న మైనార్టీలకు సీట్లు కేటాయి స్తారు. ఇంటర్ ఫస్టియర్ (జనరల్, ఒకేషనల్)లో, పదో తరగతిలో మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

- 5,6,7,8 తరగతుల్లో చేరేందుకు అవకాశం
- 6 పాఠశాలలు, 6 కళాశాలల్లో అందుబాటులో సీట్లు
- ఇప్పటికే మొదలైన దరఖాస్తుల ప్రక్రియ
- ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తుకు గడువు



కామారెడ్డిలోని మైనార్టీ గురుకుల పాఠశాల

గాంధారిలో వెలుగు చూసిన నకిలీ నోట్లు



చద్మల్‌తండాలో చలామణి అయిన దొంగనోట్లు

గాంధారి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చద్మల్‌తండాలో నిర్వహించిన లక్ష్మమ్మ జాతరలో నకిలీ 500 నోట్లు చలామణి అయ్యాయి. చద్మల్ తండాలో ప్రతీ సంవత్సరం సంక్రాంతి రోజున జాతరను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఆలయ అభివృద్ధి కోసం వచ్చిన విరాళాలతో పాటు భక్తులు ఇచ్చిన కానుకలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తారు. ఆలయానికి సంబంధించిన ఆ కమిటీలోని సభ్యులు తండాలో డబ్బులు అవసరం ఉన్నవారికి వడ్డీకి ఇస్తారు. జాతర సమయంలో తిరిగి వసూలు చేసి పండుగను ఘనంగా జరుపుతారు. ఇలా ఈసారి జాతర సమయంలో డబ్బులు తీసుకున్నవారు తిరిగి చెల్లించారు. జాతర పూర్తయిన తర్వాత అవసరం ఉన్నవారు తిరిగి వడ్డీకి తీసుకున్నారు. అయితే ఆ డబ్బుల్లో మూడు నుంచి నాలుగు దొంగనోట్లు వచ్చాయని సమాచారం. ఈ విషయంపై కొంత మంది బాధితులు నకిలీ నోట్లు వచ్చాయని గాంధారి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. పోలీసులు సైతం దొంగ నోట్ల చలామణిపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. అయితే మండలంలోని ఓ రేషన్‌డీలర్ నకిలీనోట్ల చలామణిలో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై పోలీసులు పూర్తిస్థాయి విచారణ జరపాలనే అభిప్రాయాలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి.



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నాలుగు పథకాలను అమలు చేస్తుంది

- ఈ పథకాలు అర్హులందరికీ అందే విధంగా అధికారులు కృషి చేయాలి
- సర్వేను పకడ్బందీగా గ్రామాల్లో నిర్వహించాలి
- రేపటి నుంచి 24 వరకు గ్రామ సభల్లో అర్హుల జాబితాను ప్రకటించాలి
- సర్వేలో తప్పిదాలు చేస్తే అధికారులపై చర్యలు తీసుకుంటాం
- ఎన్ని అడ్డంకులు ఎదురవుతున్నా ఇచ్చిన మాట ప్రకారం పథకాలను అమలు చేస్తున్నాం
- ఉమ్మడి జిల్లాల సమన్వయ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

7



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గంప శశాంక్

ఆరు గ్యారెంటీల అమలుకు పోరాటం చేస్తాం

కామారెడ్డిటౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారెంటీల అమలుచేసేంతవరకు ఉద్యమిస్తామని బీఆర్‌ఎస్ రాష్ట్రనాయకుడు గంపశశాంక్ అన్నారు. ఆదివారం కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం ముఖ్య కార్యకర్తల సమావేశానికి హజరై మాట్లాడారు. గ్రామాలలో ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలపై దృష్టిసారించి పరిష్కారంకోసం బీఆర్‌ఎస్ యువజన విభాగం అధికారులతో మాట్లాడి ఆ సమస్య పరిష్కారానికి కృషిచేయాలని తెలిపారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ యువజన విభాగం బలోపేతం చేసేందుకు కావాల్సిన అన్నిచర్యలను చేపట్టాలని ఆయా ఇంచార్జ్‌లకు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజనవిభాగం పట్టణ అధ్యక్షుడు భానుప్రసాద్, కామారెడ్డి,మాచారెడ్డి మండల అధ్యక్షులు అనిల్‌రెడ్డి, లష్కర్‌నాయక్, మండల నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పరుశురాంగౌడ్, ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్‌ను పూర్తిస్థాయిలో ఎత్తివేయాలి



అడ్లూర్ ఎల్లారెడ్డిలో సమావేశమైన రైతులు

సదాశివనగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మాస్టర్ ప్లాన్ జీవో నుంచి సర్వే నెంబర్లను తక్షణమే ఎత్తివేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం అడ్లూర్ ఎల్లారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్‌ను తీసుకువస్తే ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల ముందు రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా మాస్టర్‌ప్లాన్‌లోని ఇండస్ట్రీయల్, గ్రీన్‌జోన్లను ఎత్తివేయకపోవడం బాధాకరమన్నారు. మాటల ద్వారా ఇచ్చే హామీలు కాదని జీవో రద్దుచేసి రైతులకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవాలని తెలిపారు. ఎకరాల్లో ఇండస్ట్రియల్ జోన్‌ను ఏర్పాటు చేస్తే అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ఏనాడు మాట్లాడకపోవడం బాధాకరమని అన్నారు.

ఫటా..ఫట్...

పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కోసం పనులు ప్రారంభం

● రాజగంగారాం మండల విద్యాధికారి ఆర్మూర్



ఆంధ్రజ్యోతి: మనఊరు మనబడి కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

ఎంఈవో: మన ఊరు మనబడి కార్యక్రమంలో పాఠశాల్లోఅవసరమైన వసతుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపాం.

ఆంధ్రజ్యోతి: పంపిన నివేదికలపై ఏ విధామైన పనులు కొనసాగుతున్నాయి?

ఎంఈవో: పంపిన నివేదికల ప్రకారం కొన్ని చోట్ల మౌలిక వసతులను ఏర్పాటు చేశాం. కానీ అధిక బడ్జెట్ అవసరమైన చోట కాంట్రాక్టర్‌లు ముందుకు రాకపోవడంతో పనులు ఆగిపోయాయి.

ఆంధ్రజ్యోతి: ఆగిపోయిన పనులను ఏవిధంగా పునరుద్దరిస్తారు?

ఎంఈవో: కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో కొన్ని చోట్ల ఆగిపోయిన పనులను పూర్తి చేయడానికి అమ్మ ఆదర్శ పాఠశాల స్కీం ద్వారా పనులను పునరుద్ధరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పెర్కిట్ ఆదర్శ పాఠశాలలో ప్రహరి కూలిపోయి వర్షాకాలంలో మైదానం పూర్తిగా చెరువుల తయారవుతుంది ప్రహరీ నిర్మాణం ఎప్పుడు చేస్తారు?

ఎంఈవో : ప్రహరిగోడ పునర్నిర్మాణానికి నివేదికలు పంపాం. గౌరవ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి స్పందించారు. ఇదీ వరకే గ్రావెల్ వేసి చదును చేశాము. త్వరలోనే ప్రహరిగోడ నిర్మాణం చేపడతాం.

● (ఆంధ్రజ్యోతి,ఆర్మూర్)

గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం



మెండోరలో పనులను పరిశీలిస్తున్న సునీల్‌కుమార్, రమేష్‌రెడ్డి

మెండోర, జనవరి19(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి రాష్ట్ర లక్ష్యమని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అర్థాంతంగా నిలిచిపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు డ్రైనేజీ పనులను డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని అక్కడక్కడ మిగిలిపోయిన పనులను సాధ్యమైనంత వరకు తొందరగానే పూర్తి చేస్తామని సంబంధిత అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామంలో సీసీరోడ్డు, డ్రైనేజీలు, వెంకటేశ్వర కల్యాణ మండప పనులను చేసుకుందామని మార్కెట్‌యార్డు వద్ద సీసీరోడ్డు హైమాస్ లైట్ల పనులను చేసుకుందామని తెలిపారు.ఈకార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి,టౌన్‌అధ్యక్షుడు గుండోజి కొప్పెల మోహన్, సుమో రాజేశ్వర్, కొప్పెల రమేష్, రాజారెడ్డి, రాజన్న, దేవరాజ్, మౌలానా, శ్రీనివాస్, మహేష్, గంగాధర్, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పల్లె గంగారెడ్డిని సన్మానించిన కామారెడ్డి ఎమ్మెల్యే



పల్లెగంగారెడ్డిని సన్మానిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాట్‌పల్లి వెంకటరమణారెడ్డి

ఆర్మూర్‌రూరల్, జనవరి19(ఆంధ్రజ్యోతి): జాతీయ పసుపుబోర్డు చైర్మన్‌గా నియమితులైన పల్లె గంగారెడ్డిని ఆదివారం కామారెడ్డి ఎమ్మెల్యే కాట్‌పల్లి వెంకటరమణారెడ్డి సన్మానించారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో పల్లె గంగారెడ్డిని కలిసిన ఆయన శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా కామారెడ్డి ఎమ్మెల్యే కాట్‌పల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో శ్రీహరి, ఉమ్మెడ చిన్నయ్య, చిన్నారెడ్డి, శ్రీనివాస్, ముత్తెన్న పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేను కలిసిన బీజేపీ నాయకులు..

ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ఆదివారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే కాట్‌పల్లి వెంకట రమణారెడ్డిని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందులబాలు, బీజేవైఎం పట్టణ ఉపాధ్యక్షుడు పెద్దోళ్ల భరత్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేయాలని సూచించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్లను బీసీలకు ఇవ్వాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి దాసరి మూర్తి

మెండోర, జనవరి19(ఆంధ్రజ్యోతి):వచ్చే ఫిబ్రవరి మాసంలో జరిగే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలకు సంబంధించి పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్లను బీసీలకు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి దాసరి మూర్తి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలు బీసీలపై ఉన్న చిత్తశుద్ధి నిరూపించుకోవాలని, ఏ రాజకీయ పార్టీ అయితే బీసీలకు టిక్కెట్ ఇస్తే ఆ రాజకీయ పార్టీకి రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నుంచి పూర్తి మద్దతు ఉంటుందని ఆయన అన్నారు.

మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలో అడ్మిషన్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కోటగిరి,జనవరి19(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 2025-26 సంవత్సరానికి ఆన్‌లైన్ అడ్మిషన్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ మొబిన్ తెలిపారు. ఎంపీసీ విభాగంలో 40సీట్లు, బైసీపీలో 40 సీట్లు ఉన్నాయన్నారు. మైనారిటీ, మైనారిటీయేతర విద్యార్థులు టీజీఎంఆర్‌ఈఐఎస్ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల 28వ తేదీవరకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుందని, ప్రతీరోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4:30గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చందూర్ మండల గ్రామ సభల తేదీలు ఖరారు

మోస్రా,జనవరి19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లుల విషయాలు ప్రజల వద్దకు చేరవేర్చేందుకు చందూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల వారిగా గ్రామసభల తేదీలు మండల ఎంపీడీవో నీలావతి ఖరారు చేశారు. 21న కారేగావ్ తండా, ఘన్‌పూర్, 22న లక్ష్మాపూర్, 23న మేడిపల్లి గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

పోతంగల్‌లో పశువుల కొట్టం దగ్ధం

● రెండు ఆవులు సజీవ దహనం ● ఆరు ఆవులకు తీవ్ర గాయాలు



పోతంగల్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఆవులు సజీవ దహన దృశ్యం



గాయపడిన ఆవులను పరిశీలిస్తున్న పశువైద్యశాఖ అధికారి నరేందర్

నవీపేట,జనవరి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతంగల్‌లో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు పశువుల కొట్టం దగ్ధమైంది. స్థానికులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన చిలుక సాయిబాబా అనే రైతుకు 15ఆవులు ఉన్నాయి. శనివారం రాత్రి సుమారు 9గంటల సమయంలో కొట్టంతో పాటు పక్కనే ఉన్న గడ్డివాము దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కొట్టంలో 15ఆవులు ఉండగా అందులో రెండు ఆవులు సజీవ సమాధి అయ్యాయి. మరో ఆరు ఆవులకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ఆవుల తాళ్ల తొలగించడంతో అవి సురక్షితంగా బయటపడ్డాయి. వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా వారు మంటలను ఆర్పివేశారు. గాయపడిన ఆవులకు స్థానిక పశువైద్య శాఖ అధికారులు అదే రాత్రి చికిత్స అందించారు. ఆదివారం నవీపేట పశువైద్య శాఖ అధికారి నరేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి గాయపడిన ఆవులకు మెరుగైన చికిత్సను అందించారు. గాయపడిన ఆవులకు ఎటువంటి ప్రాణపాయం లేదని ఆయన వివరించారు. షాట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిన ఉంటుందని భావిస్తున్నామని, సుమారు రూరూ.3లక్షల వరకు నష్టం జరిగిందని స్థానికులు వివరించారు. బాధిత కుటుంబానికి తగిన పరిహారం చెల్లించాలని గ్రామస్థులు కోరారు.

పసుపు బోర్డు విధివిధానాలు ఖరారు చేసి మద్దతు ధర ప్రకటించాలి



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న పసుపు పోరాట సమితి నాయకులు

కమ్మర్‌పల్లి, జనవరి 19: (ఆంధ్రజ్యోతి) ఎన్నో ఉద్యమాల ఫలితంగా పసుపు రైతుల చికాల కోరికల పసుపు బోర్డు ఏర్పాటును ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తంచేస్తూ పసుపు బోర్డు విధివిధానాలు ఖరారుచేసి మద్దతు ధర రూ.15 వేలు ప్రకటించి ఈ సీజన్ నుండే పసుపు కొనుగోలు చేయాలని పసుపు పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. కమ్మర్‌పల్లి నాయకులు, రైతులు మాట్లాడుతు 2006లో కిసాన్ డే సందర్భంగా పసుపు పోరాట సమితి ఏర్పడిందని తెలిపారు. గిట్టుబాటు ధరలు అందక పసుపుపంటంటే అప్పటి పసుపు రైతులు వద్దనుకునే పరిస్థితులు ఎదుర్కున్నారని గిట్టుబాటు ధరల కోసం గల్లినుండి డిల్లీ వరకు అందోళనలు చేశామన్నారు. 2007-08లో డిల్లీ లోని జంతర్‌మంతర్ వద్ద నాయకులు, రైతులతో కలిసి చేపట్టిన ఉద్యం తరువాత స్పందించిన అప్పటి సీఎం వైఎస్‌ఆర్ కమ్మర్‌పల్లి లో పసుపు పరిశోదన కేంద్రానికి పునాదులుపడ్డాయని గుర్తుచేశారు. అయిన పసుపు రైతులు పరిస్థిలు మారక ఉద్యమాలే సరైన మార్గంగా ఎంచుకుని ఎందరో నాయకులు నిరంతరం పోరాటాలు చేస్తు వచ్చారని అన్నారు. ఏది ఏమైనప్పటికి పసుపు బోరుడ ఏర్పాటును స్వాగతిస్తున్నామని హర్షం వ్యక్తచేశారు. అయితే పసుపు బోర్డు విధివిధానాలు ఖరారు చేస్తు రైతులకు క్వింటాలు పసుపు పంటకు 15 వేల మద్దతుధరను ప్రటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పసుపు పోరాట సమితి అధ్యక్షులు సుంకెట రాజమల్లు, ఉపాధ్యక్షులు వేప చెట్టు గంగారాం, కార్యదర్శి వేముల శ్రీనివాస్, రైతులు బామని రాజన్న, జేసీబి రాజన్న, కొమ్ముల రవి, గడ్డం నరేందర్, గడ్డం నవీన్ తదతరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



కోటగిరిలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకులు ఓమయ్య

కోటగిరి,జనవరి19(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు ఓమయ్య డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో ఏఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ప్రభుత్వ స్థలాల పరిరక్షణకై సీపీఐ పార్టీమండల కార్యదర్శి విఠల్ గౌడ్ అధ్యక్షతన రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువైన స్థలాలు కబ్జా చేయడం వల్ల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. సాగునీటి కాలువలను కబ్జా చేసి దర్జాగా రేకుల షెడ్లు ఏర్పాటు చేస్తుంటే అధికారులు మీనమేషాలు లెక్కించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టిన అటు రెవెన్యూ, ఇటు ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంలో అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. సాగునీటి కాలువ ఖాళీ స్థలాలను కబ్జా చేయడం వల్ల రైతులకు సాగునీరు అందించే క్రమంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. సాగునీటి కాలువలకు హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. రౌండ్ టెబుల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున దర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు నవీన్, రాజు, పోచీరాం, సాయన్న, హొగిర్ దేశాయ్, లింగరాం, ఆకుల పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



కారు ప్రమాదంలో మరణించిన మచ్చర్ల రజినీ, రజినీ (ఫైల్)

ఎడపల్లి, జనవరి19(ఆంధ్రజ్యోతి): తన అక్క మనవడి పుట్టిన రోజు వేడుకకు శనివారం వచ్చి అందరితో ఆనందంగా గడిపి ఆదివారం ఉదయం తన ఇంటికి బయలు దేరడానికి బస్సుకోసం ఎదురు చూస్తున్న ఆమెను కారు ప్రమాదం రూపంలో అనంతలోకానికి తీసుకు వెళ్లింది. ఈ ఘటన ఆదివారం ఎడపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే నిజామాబాద్ పట్టణానికి చెందిన మచ్చర్ల రజినీ(48) తన అక్క మనవడి శుభకార్యానికి ఎడపల్లికి వచ్చింది. శుభకార్యంలో అందరితో ఆనందంగా గడిపి ఆదివారం ఉదయం తన ఊరుకు వెలుదామని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రిక్వెస్ట్ బస్ స్టాప్ వద్ద బస్సుకోసం రోడ్డు ప్రక్కన నిలబడగా బోధన్ నుంచి నిజామాబాద్ వైపు వెలుతున్న హ్యుందాయ్ ఐ10 వాహనం అతివేగంగా వచ్చి రజినీని ఢీ కొట్టడంతో 50 అడుగుల దూరంలో ఎగిరి చెట్టుకు తగిలి ప్రక్కనే ఉన్న రాయిపై పడడంతో అక్కడిక్కడే మరణించింది. ఈ సంఘటన చూసిన స్థానికులు కారును ఆపి అందులో ఉన్న ఇద్దరు యువకులను పోలీసులకు అప్పగించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

● కారు డ్రైవర్‌పై కేసు నమోదు

ఎడపల్లి మండల కేంద్రంలోని రిక్వెస్ట్ స్టాపు వద్ద బస్సు కోసం వేచి ఉన్న మచ్చర్ల రజిని అను మహిళను అతి వేగంగా వచ్చిన హ్యుందాయ్ కారు ఢీ కొనడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. ఈ విషయమై మృతురాలి అక్క శిరిశెట్టి లక్ష్మి ఫిర్యాదు చేయగా కారు డ్రైవర్ మొమ్మద్ నోమాన్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎడపల్లి ఏఎస్సై ఇలియాస్ తెలిపారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ ఎన్నిక

ఎడపల్లి, జనవరి19(ఆంధ్రజ్యోతి):ఎడపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీని ఆదివారాం ఏకగ్రీవంగా ఎన్నుకున్నటు ఎడపల్లి గౌడ కులస్థులు తెలిపారు. రేణుకా ఎల్లమ్మ అలయ కమిటీ గౌరవ అధ్యక్షులుగా మల్లాగౌడ్, అధ్యక్షులుగా రావుట్ల ఎల్లాగౌడ్, ఉపాధ్యక్షులుగా కేసరి ప్రభాకర్ గౌడ్, ప్రహ్లద్ గౌడ్, కార్యదర్శిగా అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల నర్సాగౌడ్, సలహాదారులుగా నటరాజ్‌గౌడ్, శంకర్ గౌడ్, నాగాగౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఈ కమిటీ రెండేళ్ళ పాటు కొనసాగుతుందని వారు తెలిపారు.

రూ.2లక్షల ఎల్‌వోసీ అందజేత

ముప్కాల్, జనవరి19(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామానికి చెందిన నిజా ముద్దిన్ ఇటీవల ప్రమాదవశాత్తు తలకు తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో వెంటిలెటర్ చికిత్స పొందుతున్న విషయాన్ని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలియజేయడంతో బాధిత కుటుంబానికి రూ.2లక్షల ఎల్‌వోసిని హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన తమ్మిశెట్టి ఆరోగ్యం

నందిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామ్ రెడ్డి ట్రాక్టర్ ట్రాలీ వర్క్‌షాప్ వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టి త మ్మిశెట్టి ఆరోగ్యం (62) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ ఎం చిరంజీవి తెలిపారు. మండలంలోని కొల్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్ టీఆర్ కాలనీకి చెందిన తమ్మిశెట్టి ఆరోగ్యం (62) అనే వ్యక్తి తన బైక్‌ను రిపేర్ కోసమని తోసుకుంటూ వస్తుండగా ఎదురుగా వస్తున్న కందకుర్తి రవి కుమార్ అనే వ్యక్తి తన బైక్‌తో అతివేగంగా, అజాగ్ర త్తగా నడు పుతూ ఢీకొట్టాడు. దింతో ఆయనకు బలమైన గాయాలై మృతి చెందాడు. మృతుని కుమారుడు తమ్మిశెట్టి సాయి కుమార్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

ముప్కాల్,జనవరి19(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు లక్ష్మీకెనాల్‌లో చేపల వేటకు వెళ్ళి ముప్కాల్‌కు చెందిన అనికేష్ తేజ (19) మృతి చెందినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం తేజ ఆయన స్నేహితులు ఆయన స్నేహితులైన ఆవల అభినవ్, అనికేష్ రిషి కలిసి నల్లూర్ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో చేపల వేటకు వెళ్ళారు. కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో అభినవ్, రీషి నీటిలో నుంచి బయటకు రాగా తేజ నీటి ప్రవాహంలో కొటుకుపోయాడు. దీంతో రైతుల సహకారంతో పోలీసులు గజా ఈతగాళ్ళతో వేతగగా సంఘటన స్థలానికి వంద మీటర్ల దూరంలో మృతదేహం లభించింది. మృతుడి తండ్రి సాయేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయేందర్‌కు ఇద్దరు కొడుకు, ఒక కూతురు కాగా చిన్న కుమారుడు అనికేష్ తేజ మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

రామన్నపేట్ బాధితులకు ఆర్థిక సహాయం

వేల్పూర్, జనవరి19(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామానికి చెందిన గడ్డం వినయ్‌కుమార్ ఆయన కుమారుడు గడ్డం వర్షిత్ ఆర్థిక సహాయం కోసం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వేల్పూర్ రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. హైదరబాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇప్పటి వరకు రూ.7లక్షల వైద్యఖర్చులు అయ్యాయని బాధితుడు తెలిపారు. హెల్పింగ్ హ్యాండ్ సేవ సంస్థ సభ్యులు బాలసాయిలు, లింబాద్రి, జైపాల్, బాల్‌రాజ్, పాల్గొన్నారు.



రామన్నపేట్ బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్ సంస్థ

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు

ఎడపల్లి, జనవరి19(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల బిఆర్‌ఎస్ నాయకులు ఆదివారం నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యలయంలో ఎమ్మెల్సీ కవితను కలిసి పార్టీ బలోపేతం, పలు అంశాలపై చర్చించినట్లు పార్టీ మండల అధ్యక్షులు దేరడి శ్రీరాం తెలిపారు. కవితను కలిసిన వారిలో రవీందర్ గౌడ్, ఉండి నాగేందర్ రెడ్డి, పరిగె సుమన్, కృష్ణ తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లిలో కొనసాగుతున్న 80వ జ్ఞాన యజ్ఞం



బోధిస్తున్న గీతా ప్రబోధక్ గీతాసత్సంగ్ చీలమంతుల ఛత్రపతి

కమ్మర్‌పల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని కశీర్ హనుమాన్ ఆలయంవద్ద గల అయ్యప్పస్వామి దేవాలయ సన్నిధానంలో గత రెండు రోజులుగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 80వ జ్ఞాన యజ్ఞ కార్యక్రమము(హనుమాన్ చాలీసా, భజగోవిందం వ్యాఖ్యానంతో) గత రెండు రోజులగా కొనసాగుతున్నది. శనివారం రాత్రి నిర్వాహకులు ఉత్తమ గీతా ప్రబోదక్ గీతాసత్సంగ్ చీలమంతుల ఛత్రపతి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం వారం రోజులపాటు సాయంత్రం 6.30 నుంచి 8గంటల వరకు కొనసాగుతుందని నిర్వహకులు తెలిపారు. ఈసక్తిగల మహిళలు, పురుషులు ఈ భగవంతుని జ్ఞానయజ్ఞ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు

భీమ్‌గల్‌రూరల్, జనవరి19(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మండలంలోని దేవన్‌పల్లి, కారేపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు గోపాల్ నాయక్ అందజేశారు. దేవన్‌పల్లి గ్రామానికి చెందిన సదానందకు రూ.1000, కారేపల్లి గ్రామానికి చెందిన బాదవత్ నీలబాయికి రూ.42వేల చెక్కు మంజూరు కాగా ఆయన అందజేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ఎస్టీసెల్ ప్రధానకార్యదర్శి మాలవత్ రాములునాయక్, మాలవత్ రమేష్, బొడ్డు గంగాధర్, బొడ్డు చిన్న గంగారాం, చిన్నయ్య, లింబాద్రి, వంజర రమేష్, శంకర్, నర్సింగ్, రమేష్, పాల్గొన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఆరు ఇసుక ట్రాక్టర్లు

కోటగిరి,జనవరి19(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు కోటగిరి ఎస్ఐ సందీప్ తెలిపారు. పొతంగల్ మండలంలోని సుంకిని మంజీర నది నుంచి నాలుగు, కొడిచర్ల గ్రామం నుంచి రెండు ట్రాక్టర్లను ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

అప్పుడే పుట్టిన పసిపాపను వదిలేసిన గుర్తుతెలియని వ్యక్తులు

మాక్లూర్, జనవరి19(ఆంధ్రజ్యోతి): మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిక్లి గ్రామశివారులో ఆదివారం తెల్లవారు జామున అప్పుడే పుట్టిన పసిపాపను రోడ్డు పక్కన చెట్లపొదల మధ్య వదిలేశారు. ఉదయం ఉదయం వాకింగ్‌కు వెళ్తున్న గ్రామస్థులకు చూడగా పసిపాప ఏడుపు వినిపించింది. ఇట్టి విషయాన్ని గ్రామస్థులు పంచాయతీకార్యదర్శికి సమాచారం అందించగా దీంతో కార్యదర్శి ఎస్సై రాజశేఖర్‌కు తెలుపగా శిశువును చికిత్స గురించి అంగన్‌వాడి టీచర్‌లకు, ఆశవర్కర్‌ల ద్వారా నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిజామాబాద్‌లోని ఐసీడీఎస్ తెలియపర్చి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పసికందుకు బొడ్డు కూడ కత్తిరించకుండా రక్తం మరకలతో ఆడ పసికందును స్థానికులు వదిలేసి పోయారు.

అన్నారంలో ఒకరి దారుణ హత్య





మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, పొక్కిలి రవి (ఫైల్)

రామారెడ్డి, జనవరి19(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా రామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో అన్నారం గ్రామంలో స్వంత ఇంట్లో దారుణ హత్యకు గురైన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన ఎస్సై నరేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రామారెడ్డి మండలం అన్నారంలో గ్రామానికి చెందిన పొక్కిలి రవి(41) శనివారం రాత్రికి హత్యకు గురైనట్లు ఎస్సై తెలిపారు అనుమానాస్పద స్థితిలో వ్యక్తిని హత్య చేసిన సంఘటన ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. సొంత ఇంట్లో మంచంపై పడుకొని ఉండగా గుర్తు తెలియని దుండగులు పదునైన ఆయుధంలో పొడిచి హత్య చేసి పరారైనట్లు తెలిసింది. ఆదివారం ఉదయం చూడగా రక్తమడుగులో పొక్కిలి రవి మరణించినట్లు భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. కాగా మృతదేహాన్ని చూసేందుకు కామారెడ్డి జిల్లా ఏఎస్పి చైతన్యరెడ్డి, రూరల్ సీఐ రమణ, ఎస్సై నరేష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వివిధ కోణాల్లో పరిశీలించారు. కాగా గతంలో అన్నారం గ్రామం నక్సలిజంకు సంబంధించిన గ్రామం కావడంతో స్పెషల్ పార్టీ పోలీసులు, సివిల్ పోలీలు పలు కోణాల్లో భారీ బందోబస్తు నిర్వహించారు. మృతుని భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

● సర్వేను పకడ్బందీగా గ్రామాల్లో నిర్వహించాలి ● రేపటి నుంచి 24 వరకు గ్రామ సభల్లో అర్హుల జాబితాను ప్రకటించాలి
● సర్వేలో తప్పులుంటే అధికారులపై చర్యలు ● ఇచ్చిన మాట ప్రకారం పథకాలు అమలు చేస్తున్నాం ● ఉమ్మడి జిల్లాల సమన్వయ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

నిజామాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రత కార్డుల పథకాలను అమలు చేస్తుంది. రైతులకు ఇచ్చిన వాగ్దానాలతో పాటు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ వాస్తవ రూపం దాల్చే విధంగా పథకాలను ప్రవేశపెడుతుంది. ప్రతీ పథకాన్ని పరిశీలించి అమలు చేయడంతో పాటు అర్హులకు అందే విధంగా చర్యలను చేపడుతుంది. ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న నాలుగు పథకాల సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి. గ్రామ సభలు నిర్వహించి అర్హుల జాబితాను ప్రకటించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అ న్నారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లా ల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమా వేశంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రత కార్డులపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రజల కోసం పథకాలను అమలు చేస్తుందని ఇన్‌చార్జి మంత్రి అన్నారు. అధికారులు సర్వే సమయంలోనే సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనలకు అనుగుణంగా అర్హులను ఎంపిక చేయాలన్నారు. ఈ నాలుగు పథకాలు ఎంతో కీలక మని వీటిలో ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాల న్నారు. ఎక్కడైనా తప్పులు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ స్థాయిలోనే పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలన్నారు. రైతుభరోసా అమలులో గత పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వం హయాంలో రైతు బంధు పేరు మీద గుట్టలకు, వెంచర్లకు వ్యవసాయ యోగ్యం కాని భూములకు ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పంటలు పండే భూములకే ఇచ్చే విధంగా చూడాలన్నారు. సర్వేలో అధికారులు జాగ్రత్తగా ఉండా లన్నారు. అర్హులకు అన్యాయం చేసే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదన్నారు. ఎంపిక చేసిన జాబితాను ప్రతీ ఒక్కరికి చేరే విధంగా చూడాలన్నారు. ఆయా నియోజకవర్గాల్లోని సమా చారాన్ని ఎమ్మెల్యేలకు అందించాలన్నారు. రేషన్ కార్డులు అందరికి రావడం లేదని అపోహ మాత్రమేనని అన్నారు. గ్రామ సభల్లో రాని వారి దరఖాస్తులను కూడా తీసుకుం టామన్నారు. రేషన్ కార్డు జారీ అనేది కంటిన్యూగా కొన సాగుతుందన్నారు. తమ ప్రభుత్వం కూడా అన్ని ఆలోచించే వీటిని అమలు చేస్తున్నామన్నారు. ఆర్థిక సంక్షోభం ఉన్న సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మొదట ఇళ్లులేని నిరుపేదలకు అందే విధంగా చూడాలన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సరిపడా నిధులు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఐదారు నియోజకవర్గాల్లో మాత్రమే ఈ ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారని అన్నారు. మిగతా ఎక్కడ కూడా ఇళ్ల నిర్మాణం చేపట్టలేదన్నారు. త మ ప్రభుత్వం నేరుగా లబ్ధిదారులకే నిధులను అందిస్తుందన్నారు. వారికి నచ్చిన రీతిలో ఇళ్లను నిర్మించుకోవ చ్చన్నారు. గత ప్రభుత్వంలో నిర్మాణమై అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను కూడా పరిశీలిస్తామని మంత్రి అన్నారు. పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందే విధంగా చూస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2లక్షల లోపు రుణమాఫీ చేశామన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొన్ని బ్యాంకుల పరిధిలో కాలేదన్నారు. వాటిని కూడా రెక్టిఫై చేస్తూ అయ్యే విధంగా చూస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే మెజార్టీ రైతులకు రుణమాఫీని చేశామన్నారు. గత ప్రభుత్వం తమకు బంగారు పళ్లెంలో పెట్టి ప్రభుత్వాన్ని అందించలేదన్నారు. అప్పులనే అప్పచెప్పడంతో నెలకు ఆరున్నర వేల కోట్ల రూపాయలను చెల్లిస్తున్నామన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో సంవత్సరానికి రూ.6500 కోట్ల అప్పులు చెల్లిస్తే ఇప్పుడు ఎక్కువ మొత్తంలో చెల్లిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఎమ్మెల్యేలు తన దృష్టికి తీసుకువచ్చిన అన్ని సమస్యలను పరిష్కరించుకునే విధంగా పూర్తి చేస్తామన్నారు. ఖిల్లా జైలులో దాశరథికి సంబంధించిన మ్యూజియం ఏర్పాటును పూర్తి చేస్తామన్నారు. అవసరమైన నిధులను కూడా సమకూరుస్తామన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందే విధంగా ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు సహకరించాలని ఆయన కోరారు.

ఈ సమన్వయ సమావేశంలో రెండు జిల్లాల్లో అమలు చేస్తున్న ఈ నాలుగు పథకాలను జిల్లా కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, ఆశీష్ సంగ్వాన్‌లు వివరించారు. రెండు జిల్లాల పరిధిలో రైతుభరోసా, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం జరుగుతున్న సర్వేను వివరించారు. ఏఏ శాఖల వారు సర్వేలో పాల్గొంటారో వివరించడంతో పాటు ఇప్పటి వరకు పూర్తయిన సర్వే వివరాలను వెల్లడించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈనెల 26న ఈ పథకం అమలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమన్వయ సమావేశంలో రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్లు తాహెర్‌బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, తారిక్ అన్సారి, వ్యవసాయ కమీషన్ సభ్యులు గడుగు గంగాధర్, ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్ నాయక్, డీసీసీబీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కేశ వేణు, మేయర్ నీతూకిరణ్, నిజామాబాద్ అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డిలు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్పగంగారెడ్డితో పాటు ఉమ్మడి జిల్లాల మున్సిపల్ ఛైర్మన్లు, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ పెండింగ్ బిల్లులు ఇవ్వాలి: ఎమ్మెల్సీ కవిత



ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లను నిర్మించుకున్నారు. వారికి ఇప్పటికీ బిల్లులు రాలేదు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికి జారీ చేయాలి. ప్రస్తుతం 20శాతం దరఖాస్తులనే పరిశీలించడం వల్ల అందరికి న్యాయం జరగడం లేదు. రేషన్ కార్డుల కోసం ఆదాయ పరిమితిని కూడా పెంచాలి. రైతు కూలీలందరికి ఆత్మీయ భరోసా అందే విధంగా చూడాలి. ఇందిరమ్మ కమిటీలపైన అధికారుల కమిటీ లను వేయాలి. ఖిల్లా జైలులో దాశరథి మ్యూజి యాన్ని పూర్తి చేయాలి. ఖాళీగా ఉన్న నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పోస్టును భర్తీ చేయాలి. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి.

రైతుభరోసా అందరికీ ఇవ్వాలి: ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



గత కేసీఆర్ ప్రభుత్వం 11 విడతల్లో రైతుబంధు రైతులకు అంద జేసింది. రాష్ట్రంలో రూ.72వేల కోట్లు జిల్లాలో రూ.2650 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది. రెండు పంటలకు ఎకరానికి రూ.10వేల చొప్పున ఇచ్చింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రూ.10వేలకు బదులు ఎకరానికి రూ.15వేలు ఇస్తామని మాట ఇచ్చారు. మొదటి యాసంగి పంటకు రూ.5వేలు చొప్పున విడుదల చేశారు. రెండో పంటకు ఇవ్వలేదు. ప్రస్తుతం రైతుభరోసాను అమలు చేస్తున్నారు. గత విడతలు కలిపి రైతుల ఖాతాల్లో జమ చేయాలి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ కూలీలందరికీ పథకాన్ని అందజేయాలి. ఉపాధి హామీ కూలీలకు ఇవ్వడం వల్ల మిగతా వారికి రావడం లేదు. 60ఏళ్లు దాటిన వారికి కూడా వర్తింపజేయాలి.

అందరి కోసం ఈ నాలుగు పథకాలు
● ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



రాష్ట్ర ప్రభుత్వం అందరి కోసం ఈ నాలుగు పథ కాలను అమలు చేస్తుంది. రైతుభరోసా నుంచి ఆత్మీయ భరోసా వరకు అర్హులైన వారందరికీ అందే విధంగా చూడాలి. పథకాలు అమలు చేసినప్పుడు సమస్యలు వస్తాయి. వాటిని అధికారులు పరిశీలించాలి. సర్వేలో అర్హులైన వారికే వచ్చే విధంగా చూడాలి. పంట పండే ప్రతి రైతు భూమికి భరోసా అందించాలి. అర్బన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లను పెంచాలి. ఆత్మీయ భరోసా కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలి. రైతు రుణమాఫీ ప్రభుత్వం చేస్తుంది. మిగిలిన వారికి కూడా చేసే విధంగా ప్రయత్నాలు చేస్తుంది.

రైతులను ఆదుకునేందుకే భరోసా
● మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకే భరోసాను పెట్టింది. ప్రతీ రైతుకు భరోసాను అందిస్తుంది. కష్టాలు వచ్చిన రుణమాఫీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతుల ప్రభుత్వం. గత కాంగ్రె స్ ప్రభుత్వ హయాంలో జిల్లాలో సాగునీటికి ప్రాధాన్యత ఇచ్చాం. లిఫ్టలను ఏర్పాటు చేశాం. ప్రాణహిత ప్యాకేజీ పనులను చేపట్టాం. అదే రీతిలో రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకున్నాం. గత ప్రభుత్వం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోలేదు. ఆత్మీయ భరోసా కూలీలందరికీ అందేవిధంగా చూస్తాం. నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌ను నియమిస్తాం. ఇసుక అక్రమ రవాణా లేకుండా చర్యలు చేపడుతున్నాం.

పేద వారి కోసమే ఈ నాలుగు పథకాలు
● ఎమ్మెల్యే లక్ష్మికాంత్‌రావు



రాష్ట్రంలోని పేద వారికోసమే ఈ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుంది. రైతు భరోసా రైతులందరికీ ఉపయోగపడుతుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో అంతా సన్న చిన్నకారు రైతులు ఉన్నారు. వారందరికి వచ్చే విధంగా చూడాలి. పేద కూలీల కోసమే ఆత్మీయ భరోసాను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రేషన్ కార్డులు అర్హులైన వారందరికీ ఇవ్వాలి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జుక్కల్ నియోజకవర్గానికి ఇళ్లు రాలేదు. ఈ సారి ఇందిరమ్మ పథకం కింద ఇళ్లను నియోజకవర్గానికి పెంచాలి. లెండి, నాగమడుగు ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టాలి. ఈ రెండు నిర్మాణం చేస్తే రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారు.

ప్రాణహిత 21వ ప్యాకేజీని పూర్తి చేయాలి
● ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



జిల్లాలో చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ 21 పనులను వెంటనే పూర్తి చేయాలి. రాష్ట్రస్థాయిలో మంత్రుల వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోవాలి. ఇది పూర్తయితే రూరల్ నియోజకవర్గం పరిధిలో లక్షా 20వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. రైతు భరోసాను పోడు భూములకు కూడా ఇవ్వాలి. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు పట్టాలు ఇచ్చారు. వారందరికీ వర్తింపజేయాలి. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన అందరికి అందేవిధంగా చూడాలి. ఈ ఇళ్ల కోసం పేదలు ముందుగానే ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టారు. వారికి వర్తింపజేసే విధంగా చర్యలు చేపట్టాలి.

రాజకీయాలకు అతీతంగా పథకాలను అమలు చేయాలి
● ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు పథకాలను రాజకీయాలకు అతీతంగా అమలు చేయాలి. అర్హులైన వారందరికి అందే విధంగా చూడాలి. ఏ పార్టీకి సంబంధం లేకుండా పేదలకు పథకాలు అందాలి. ఈనెల 26 తర్వాత అన్ని గ్రామాల పరిధిలో పర్యటిస్తాను. అధికారులతో గ్రామాల్లోనే పథకాలపై సమీక్షిస్తాను. అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటాను. తమ నియోజకవర్గం పరిధిలో రుణమాఫీ 40 శాతం కూడా పూర్తి కాలేదు. అర్హులైన రైతులందరికి రుణమాఫీ అయ్యే విధంగా చూడాలి. ఏ పథకం అమల్లో రాజకీయాలకు తావివ్వకుండా పేదలకు అందేవిధంగా చర్యలు చేపట్టాలి.

నిజామాబాద్ అర్బన్‌లో పేదల కోసం ఇళ్లను పెంచాలి
● ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి గత పదేళ్లలో డబుల్ బెడ్‌రూంలు తక్కువగా వచ్చాయి. అర్హులైన వారికి ఇవ్వలేదు. ఇందిరమ్మ పథకం కింద 3500 ఇళ్లను మంజూరు చేశారు. ఇవి సరిపోవు. వీటిని డబుల్ చేయాలి. అర్బన్ నియోజకవర్గం పరిధిలో పేదలకు ఇళ్ల స్థలాలు లేవు. అవి గుర్తించి మోడల్ కాలనీల నిర్మాణాలు చేయాలి. నాగారంలో నిర్మాణం పూర్తయి ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు కేటాయించాలి. మళ్లీ కొత్తగా డ్రా తీసి ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లు అందజేయాలి. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలి.

గ్రామాల్లో అక్రమాలు లేకుండా పథకాలు అమలు చేయాలి
● ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి




గ్రామాల్లో నాలుగు పథకాలు అక్రమాలు లేకుండా అమలు చేయాలి. సర్వేలు చేస్తున్న సగం మందికి వచ్చే పరిస్థితి లేదు. నియోజకవర్గం పరిధిలో రేషన్ కార్డుల కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేస్తే కొంత మందివే వచ్చాయి. అర్హులైన వారందరికి కార్డులను మంజూరు చేయాలి. రుణమాఫీ అందరికి చేపట్టాలి. గత పదేళ్లలో తమ నియోజకవర్గంలో ఒక్క ఇళ్లు కూడా నిర్మాణం కాలేదు. ఇందిరమ్మ పథకం కింద ఇళ్ల మంజూరును పెంచాలి. కొడంగల్ నియోజకవర్గం లాగానే ఆర్మూర్‌కు కూడా నిధులను పెంచాలి.

రక్షణగా మేమున్నాం!


బీబీపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రభాకర్

దోమకొండ, (బీబీపేట) జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాత్రింబవళ్లు ఆపదలో అత్యవసర సమయంలో మీకు మేమున్నామని దోమకొండ, బీబీపేట పోలీసులు ప్రజలకు ధైర్యం కల్పిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలు, కస్తూర్భగాంధీ పాఠశాలలు, మహిళలకు డయల్ 100, పోలీసుల చట్టాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. దోమకొండ ఉమ్మడి మండలంలోని ప్రతీ రోజు ఒక గ్రామంలో పోలీసులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి వివిధ అంశాలపై వివరిస్తున్నారు. మహిళలు, విద్యార్థులు, యువకులు ఎవరైన అత్యవసర సమయంలో ఉన్నప్పుడు 100కు గానీ, షటీం 89853 33321 నెంబర్‌కు కాల్ చేయాలని సూచిస్తున్నారు. దోమకొండ, బీబీపేట మండలాల్లో మొత్తం 20 గ్రామాలున్నాయి. ప్రతీ గ్రామంలో ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలందరికీ అవగాహన కల్పించేందుకు డయల్ 100, షీటీం నెంబర్‌తో పాటు గ్రామ పోలీసు అధికారి సెల్ నెంబర్ రాయిస్తున్నారు.

100కు డయల్ చేయాలి
● డి.ఆంజనేయులు, ఇన్‌చార్జ్ ఎస్సై దోమకొండ



మహిళలు ఎప్పుడైన ఎక్కడైనా ఆపదలో ఉన్న సమయంలో 100కు డయల్ చేయాలి. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాం. మహిళలు బైక్‌పై, ఆటోలలో ప్రయాణించే సమయంలో బంగారు ఆభరణాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలి.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు
● సంపత్ కుమార్, సీఐ భిక్కనూరు



భిక్కనూరు సర్కిల్ పరిధిలోని మండలాల్లో అన్ని గ్రామాల్లో ప్రజలకు వివిధ చట్టాలపై స్థానిక ఎస్సైలు, ఏఎస్సైలతో కలసి అవగాహన కల్పించాం. మహిళలు, విద్యార్థులు, ప్రజల పట్ల ఎవరైన దాడులు చేసిన, ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించిన, సోషల్ మీడియాలో ఇతరులకు ఇబ్బంది కలిగేలా మేసెజ్‌లు పెట్టిన వారిపై కఠినంగా కేసులు నమోదు చేస్తాం.

ప్రపంచ వ్యాప్తంగా యోగాకు ప్రాముఖ్యం

● మన దేశంలో నేర్చుకొని వారి దేశాల్లో శిక్షణ ఇస్తున్న విదేశీయులు
● వివేకానంద యోగా కేంద్ర రజతోత్సవంలో మాజీ ఎంపీ మధుయాష్కి


మాట్లాడుతున్న మాజీ ఎంపీ మధుయాష్కి

నిజామాబాద్ అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో యోగా కేంద్రాలు ఏర్పాటు అయ్యాయని మన దేశంలో యోగా నేర్చుకొని చాలా మంది విదేశీయులు వారి దేశాల్లో ప్రజలకు యోగా శిక్షణ ఇస్తున్నారని అది మన యోగా గొప్పతనం అని మాజీ ఎంపీ మధుయాష్కి అన్నారు. ఎక్కొండ ప్రభాకర్ ఆధ్వర్యంలో నగరంలోని అర్సపల్లిలో నిర్వహిస్తున్న వివేకానంద యోగా కేంద్రం రజతోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా యోగాకు ప్రాముఖ్యత ఏర్పడిందని ప్రతీఒక్కరు మంచి ఆరోగ్యానికి యోగా చేయాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా యోగా కేంద్రాల విస్తరణకు కృషి చేస్తానని నిజామాబాద్‌లో యోగా కేంద్రాల ఏర్పాటుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మాట్లాడుతానని అన్నారు. యోగా కేంద్రాల అభివృద్ధికి స్థానిక ఎంపీ అర్వింద్ ద్వారా కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకోవాలని సూచించారు. నిజామాబాద్ ప్రజల వల్లే తనకు జాతీయ స్థాయి గుర్తింపు వచ్చిందని తాను ఎంపీగా ఉన్నప్పుడు యోగా కేంద్రాల నిర్మాణాలకు నిధులు ఇచ్చానన్నారు. యోగా గురువు ప్రభాకర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నో యోగా కేంద్రాలను ఏర్పాటు చేయడం, యోగా సాధన ద్వారా రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి అవార్డులు పొందడం గొప్ప విషయమన్నారు. యోగా గురువు ప్రభాకర్ మాట్లాడుతూ మధుయాష్కి వల్లే యోగా కేంద్రానికి పునాది పడిందని ఆయన ఎంపీగా ఉన్న కాలంలో మూడు దఫాలుగా నిధులు ఇచ్చారన్నారు. మధుయాష్కి సహకారం మరువలేనిదని ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవ సాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, బాలశేఖర్, స్థానిక కార్పొరేటర్ లావణ్య, వివేకానంద యోగా కేం ద్రం అధ్యక్షుడు ఇంద్రకరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీరాముడి రక్షతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

బోధన్‌రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాముడి రక్షతో రాష్ట్రంలోని ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి చిద్రపు ప్రదీప్ గుప్తా అన్నారు. ఆదివారం బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని శ్రీరామాలయంలో జద్గురు శ్రీ త్యాగరాజు స్వామి దివ్య ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, భక్తులు రామాలయంలో సామూహిక పారాయణం నిర్వహించారు. శ్రీరామ జయ రామ, జయ జయ రామ అంటూ శ్రీరామ సంకీర్తనాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. శ్రీరామ నామ స్మరణతో సకల శుభాలు కలుగుతాయని, ప్రతీరోజు ఆలయ ప్రదర్శన చేస్తే దోషాలు తొలగి సకలశుభాలు కలుగుతాయని ఆలయ వేద పండితులు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, వేణునాథ విద్వంసకులు శ్రీ రాకేష్ వైద్య, ఆర్యవైశ్య బోధన్ డివిజన్ ఇన్‌చార్జి కంటాల రమేష్, మహిళలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


రామాలయంలో సంకీర్తనలు చేస్తున్న దృశ్యం

ఇస్సాపల్లిలో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ఆర్మూర్‌రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సాపల్లి గ్రామంలో గత వారం రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. పోటీలలో ముగింపు కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ మార చంద్రమోహన్, ఆర్మూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, వైస్ ఛైర్మన్ ఇట్టెం జీవన్‌లు హాజరై విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ టోర్నీలో ఆర్మూర్ సబ్‌డివిజన్‌లోని వివిధ గ్రామాలకు చెందిన 38 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం ఆర్మూర్, తొర్లికొండ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆర్మూర్ జట్టు విజయం సాధించగా, తొర్లికొండ జట్టు ద్వితీయ సాధనంలో నిలిచింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమృత్‌రావు సీనియర్ నాయకులు పండిత్ పవన్, అనంత్‌రెడ్డి, సంతోష్, ముత్తెన్న, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


గన్నపల్లిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఆశా వర్కర్లపై ప్రభుత్వం పట్టింపేదీ?

» మంత్రి సీతక్క ఇచ్చిన మాట నీటి మూటలేనా!?
» సమస్యల సాధన కోసం కలెక్టరేట్‌కు పాదయాత్ర
» ప్రభుత్వం స్పందించాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆశావర్కర్లు (ఫైల్)

బాన్సువాడటౌన్ , జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సంభందిత సేవలను అందించడానికి ఆశావర్కర్లు విశేషమైన కృషి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్య వివరాలను తెలుసుకుని ఎప్పటికపుడు ప్రభుత్వానికి సమాచారమందించే వారధులుగా నిలిచేవారిలో ఆశావర్కర్లు ముఖ్యులు. గర్భిణులకు మందులు అందించడం , ప్రభుత్వ వైద్యశాలలో డెలివరీలు అయ్యేలా చూడటం, పిల్లలకు టీకాలు వేయించడం తద్వారా మాతాశిశు మరణాలు తగ్గించడంలో ఆశాలు కీలకపాత్ర పోషిస్తున్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు వీరు అందించిన సేవలు అనిర్వచనీయం. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వ్యాధులకు మందులను అందజేస్తున్నారు. అంతేకాకుండా వైరస్ మహమ్మారి బారిన పడకుండా ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ రోగాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్న ఆశావర్కర్లు కష్టాల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వాలు మారినా ఏళ్ల తరబడి తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పని బారెడు.. వేతనం మూరెడు

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు వచ్చినా గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు సమాచారం చేరవేయడంలో ఆశాలు ప్రథమంగా నిలుస్తారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పనులను చక్కబెడుతున్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రోజుకో కొత్త సర్వే నిర్వహిస్తుండంతో ఆశాలు బిజీబిజీగా ఉండిపోతున్నారు. సర్వేలు చేసి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తున్నారు. కానీ శ్రమకు దగ్గ ఫలితం దక్కడం లేదని ఆశాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని బారెడు..వేతనం మూరెడు అన్నట్లుగా తమ పరిస్థితి తయారైందని ఆశా వర్కర్లు దిగాలు చెందుతున్నారు.

నెరవేరని మంత్రి సీతక్క మాటలు

తమ డిమాండ్ల సాధన కోసం పోరాటాలు చేసినపుడు సీతక్క తమతో కలిసి ముందుకు వచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చినట్లు ఆశాలు తెలుపుతున్నారు. కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సీతక్క మంత్రి పదవి చేపట్టినా ఆశాల గురించి ఊసే ఎత్తడం లేదని ఆశావర్కర్లు వాపోతున్నారు. నాడు ఇచ్చిన మాటలు నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయని చర్చించుకుంటున్నారు. ప్రభుత్వాలు మారినా తమ తల రాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల సాధన కోసం పాదయాత్ర

జిల్లా వ్యాప్తంగా 700లకు పైగా ఆశావర్కర్లు పని చేస్తున్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 21న 10 కిలోమీటర్ల పాదయాత్రతో జిల్లా కలెక్టరేట్‌కు చేరుకోనున్నారు. జిల్లాలో ఉన్న ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనున్నట్లు సమాచారం.

ఆశావర్కర్ల డిమాండ్లు ఇవే..

- ఫిక్స్‌డ్ వేతనం 18వేల రూపాయలు చెల్లించాలి.
- ఉద్యోగ భద్రత కల్పించాలి.
- పీఎఫ్ , ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి.
- పెండింగ్ బకాయిలు చెల్లించాలి.
- ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాలు చేపడతాం
● రవీందర్ , ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు

ప్రభుత్వం ఆశావర్కర్లను చిన్నచూపు చూడటం తగదు. ప్రభుత్వానికి సంబంధించిన పనులను చేయించుకుని వారి సమస్యలను పట్టించుకోకపోవడం భావ్యం కాదు. ఆశావర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. లేని పక్షంలో ఉద్యమాలు చేపడతాం.


గెస్ట్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ జితేందర్

పోలీస్ గెస్ట్‌హౌస్ ప్రారంభించిన డీజీపీ

కామారెడ్డిటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లి శివారులో గల పోలీసుట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో నూతనంగా నిర్మించిన పోలీసుగెస్ట్‌హౌస్‌ను డీజీపీ జితేందర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణతో పాటుగా ప్రత్యేక శ్రద్ధ వహించి పోలీసు గెస్ట్‌హౌస్ ఏర్పాటుకు తమవంతుగా కృషిచేసిన పోలీసు అధికారులకు అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్టిజోన్- ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి,ఎస్పీ సింధూశర్మ, ఏఎస్పీ చైతన్యరెడ్డి, అదనపు ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు శ్రీనివాసులు, సత్యనారాయణ, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్, సీఐలు, ఆర్‌ఐలు,ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ సంబరాలు


గెలుపొందిన జట్టు సంబరాలు

మద్నూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు మండల కేంద్రంలో క్రికెట్ అభిమానుల కేరింతలతో మార్మోగింది. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 16 నుంచి ప్రారంభమై షార్ట్ బౌండ్రి డే నైట్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. సంక్రాంతి సెలవులను పురస్కరించుకుని నవ దుర్గా క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించగా, ఈ పోటీలలో మండల కేంద్రానికి చెందిన 20 క్రికెట్ జట్లు పాల్గొన్నారు. వారిలో గెలుపొందిన మొదటి, రెండవ జట్టుకు రూ.5 వేలు, రూ. మూడు వేల చొప్పున నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ క్రీడా పోటీలలో గెలుపు, ఓటములు తథ్యం అని, అదేవిధంగా జీవితంలో కూడా గెలుపు ఓటములు కూడా ఓర్చుకోవాలని, క్రీడలతో పాటు మానసికంగా సిద్ధంగా కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నరేష్, పశువైద్యాధికారి బండి విజయ్, బీజేపీ నాయకులు కృష్ణ పటేల్, హన్మాండ్లు, కాంగ్రెస్ నాయకులు రాములు, కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం


క్రీడాకారున్ని సన్మానిస్తున్న దృశ్యం

మాచారెడ్డి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలం పరిధ్‌పేట్ గ్రామానికి చెందిన జీడిపల్లి సునిల్‌రెడ్డి జాతీయ స్థాయి అథ్లెటిక్ క్రీడలకు ఎంపికయ్యారు. దీంతో మాజీ వైస్ ఎంపీపీ జీడిపల్లి నరసింహరెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు సన్మానం చేశారు. ఫిబ్రవరి 12 తేదిలలో కేరళ రాష్ట్రంలో జరిగే నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్‌లలో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనభరచడంతో జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

భగళాముఖి అమ్మవారి క్యాలెండర్ ఆవిష్కరణ


భగళాముఖి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

ఎల్లారెడ్డి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్ డిపో పక్కన బీడీ వర్కర్స్ కాలనీలో కొలవై ఉన్న భగళాముఖి అమ్మవారి పీఠం నూతన క్యాలెండర్‌ను ఆదివారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త చేతుల మీదుగా ఆదివారం క్యాంపు కార్యాలయంలో భగళాముఖి క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి పీఠం చాలా శక్తివంతమైందని అమ్మ వారికి సేవ చేయడం తనకు తన కుటుంబానికి దక్కిన మహా భాగ్యమని అమ్మవారి కరుణ కటాక్షాలతో నగర ప్రజలు మనసు చూరగొని ఎమ్మెల్యేగా గెలుపొందానన్నారు. ఈ కార్యక్రమంలో పీఠం నిర్వాహకులు క్రాంతి పటేల్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవంత్, బొబ్బిలి నరసయ్య, ఫణీంద్ర, లక్ష్మీనారాయణ, నాగరాజు సేవకులు సతీష్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ నేతలు రాజకీయంగా రాణించాలి

● జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాలకిషన్ గుప్తా


నాగిరెడ్డిపేట మండల ఆర్యవైశ్య నేతలను సన్మానిస్తున్న దృశ్యం

నాగిరెడ్డిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం నేతలు రాజకీయంగా రాణించాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాలకిషన్ గుప్తా కోరారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం భవనంలో నూతనంగా ఎన్నికైన మండల ఆర్యవైశ్య సంఘం సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ గుప్త ఘనంగా సన్మానించారు. మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా గంగా సతీష్ కుమార్ గుప్త, గౌరవ అధ్యక్షుడిగా నంగునూరి మాణిక్యం గుప్త, ఉపాధ్యక్షులుగా శివకుమార్ గుప్త, సత్యనారాయణ గుప్త, ప్రధాన కార్యదర్శిగా దిగంబర్ గుప్త, కోశాధికారిగా బాలనాగయ్య గుప్తలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్య వైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ముత్యపు సుదర్శన్ గుప్త, కోశాధికారి మోటూరి రాజులు గుప్త, జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు విజయ, ప్రధాన కార్యదర్శి పడిగల రమాదేవి, మండల ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షులు భూపతి కవిత, ప్రధాన కార్యదర్శి మంజుల, కార్యదర్శి కుంచారపు స్వప్న, కోశాధికారి నవనీత, పలు గ్రామాల ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

భిక్కనూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన యశ్వంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి గ్రామ యూత్ ఫర్ యూనిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ స్నేహితుడైన యశ్వంత్‌రోడ్డుప్రమాదంలో మృతి చెందడం బాధకరమన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని రూ. 32,200లను అందించారు. ఈ కార్యక్రమంలో యూత్‌ఫర్ యూనిటి సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘానికి రూ.5లక్షల విరాళం..


సంఘానికి విరాళం అందిస్తున్న మాజీ సర్పంచ్

భిక్కనూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం అభివృద్ధికి రూ.5లక్షల విరాళాన్ని మాజీ గ్రామసర్పంచ్ తునికివేణు ఆదివారం సంఘసభ్యులకు అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనవంతుగా సంఘం అభివృద్ధికి ఈ విరాళాన్ని అందించడం జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు సంఘం అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బండిరాములు, ప్రముఖన్యాయవాదులు నందరమేష్, గజ్జల భిక్షపతి, విండో చైర్మన్ భూమయ్య, నాయకులు సురేష్, బోండ్ల శేఖర్, రామచంద్రం, ఆంజనేయులు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ


బిచ్కుందలో పూజ నిర్వహిస్తున్న స్వాములు

బిచ్కుంద, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బిచ్కుంద పట్టణంలో శివ స్వాముల పీఠపూజలో ఊరడమ్మ గుడి వద్ద శివదీక్ష చేపట్టిన గాండ్ల అశోక్ జ్యోతిర్లింగ దైవమైన పరమశివయ్య పూజను బిల్వార్చన, పంచామృతభిషేకం అందరికి కనుచూపు కలిగించే విధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్వాములు సంజీవ్, అశోక్, వీరేశం, శివరాజ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన మాజీ ఎంపీపీ


గాయాలపాలైన వ్యక్తితో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ

మాచారెడ్డి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామరహదారిపైన గుర్తుతెలియని బైక్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో మాచారెడ్డి మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు కారులో అటువైపుగా వెళ్తుండగా గమనించి అంబులెన్స్‌కు సమాచారం చేరవేయడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

కిరాణ వర్తక సంఘం నూతన కార్యవర్గం

రాజంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజంపేట కిరాణ వర్తక సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం కార్యదర్శి శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. అధ్యక్షులుగా ములుగు చంద్రమౌళిగుప్తా, ఉపాధ్యాక్షులుగా మొగిలిపల్లి రాజు,కార్యదర్శిగా శ్రీనివాస్‌గుప్త, కోశాధికారిగా వెంకటరాజేశ్వర్‌గుప్తా, కార్యవర్గసభ్యులుగా ప్రవీణ్,పద్మారావు, అనిల్, శ్రీనివాస్, నర్సింలు, రాజు, నర్సింలు, సంకిత్, నరేందర్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుల అరెస్టు

మోపాల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మోపాల్ మండల కేంద్రంలో ఓమహిళను హత్య చేసిన నిందితులను అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించిన పోలీసులు. గ్రామంలో గ్రామస్థులు చర్చించుకుంటున్న తీరు ఓ మహిళ ఇంట్లో మనుషులు ఓ గంట కనిపించక పోయే సరికి ఇంట్లో ఉన్న వారంతా ఆగమయ్యే రోజులు ఇవి. ఇంట్లో నుండి బయటకు వెళ్లిన మనిషి ఆరు నెలల నుండి ఇంటికి తిరిగి రాకపోయినా కుటుంబ సభ్యులు ఎవరూ పట్టించుకోకపోవడంపై మండలంలో చర్చనీయాంశమైంది. జంగం విజయను అదే గ్రామానికి చెందిన బుచ్చన్న, నగేష్‌లు కలిసి దారుణంగా హత్యచేసి పూడ్చి పెట్టారు. ఈ సంఘటన జరిగి ఆరు నెలలు గడిచింది. హత్య సంఘ టన బయటపడలేదు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన విజయ గురించి కుటుంబ సభ్యులు ఎవరూ ఆరా తీయలేదు. హత్య జరిగిన కొన్ని రోజులకే విజయ కుటుంబ సభ్యులకు కొంత సమాచారం తెలిసిం దని గ్రామస్థులు వివరించారు. కన్న తల్లి హత్య సమా చారం తెలియడంతో విజయ కుమారుడు బుచ్చన్న జీతగాడు నగేష్‌కు నిత్యం మద్యం తాగించి పూర్తి సమాచారాన్ని రాబట్టాడని గ్రామస్థులు తెలిపారు. ఈసమాచారం బుచ్చన్నకు తెలిసి పోవడంతో వీరిద్దరి మధ్య డబ్బుల బేరం కుదరకపోవడం వల్లే హత్య సంఘటన బయటపడిందని గ్రామంలో చర్చనీయాంశమైంది. హత్య జరిగిన సంఘటన బయటకు రావడంతో గ్రామస్తులు పలువురు అను మానాలను వ్యక్తం చేస్తున్నారు. బుచ్చన్న గత కొన్ని సంవత్సరాల నుంచి గ్రామంలో చిట్టీలు నడుపుతున్నాడని ఇతని వద్ద గ్రామస్తులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా అనేక మంది చిట్టీలు వేస్తారని గ్రామస్తులు తెలిపారు. ఏది ఏమైనా విజయ చిట్టీ డబ్బులు బుచ్చన్నను అడిగే సరికి ఒక పతకం ప్రకారం హత్య చేయడంతో గ్రా మంలోనే కాకుండా మండలంలోనే ఈ ఘటన చర్చనీయాంశమైంది.

నిందితుల రిమాండ్

విజయ హత్య కేసులో అదే గ్రామానికి చెందిన బుచ్చన్న, నగేష్‌లను ఆదివారం ఉదయం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. విజయ కుమారుడు మనోహర్ ఫిర్యాదు చేసిన 48 గంటల్లోనే హత్య కేసును ఉన్నతాధికారుల సమక్షంలో చేదించామని ఇందుకు తమ సిబ్బంది పూర్తి సహకారాన్ని అందించారని తెలిపారు.
-ఎస్సై యాదగిరి గౌడ్

రైతు భరోసా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి


బస్వాయిపల్లిలో రైతు భరోసా సర్వే చేస్తున్న అధికారులు

నసురుల్లాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు భరోసా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సీనియర్ అసిస్టెంట్ హలీం అన్నారు. ఆదివారం నసురుల్లాబాద్ మండలంలోని బస్వాయిపల్లి గ్రామంతో పాటు దుర్కి, మిర్జాపూర్ క్లస్టర్ల పరిధిలో కొనసాగుతున్న రైతు భరోసా సర్వేను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండా, పంట పండించే రైతులందరికీ రైతు భరోసా అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఈవో ప్రియాంక, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు జాకీర్, మోసిన్ తదితరులున్నారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

నసురుల్లాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి దుర్కి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దుర్కి గ్రామానికి చెందిన బొజ్జ సుధాకర్ (46) గత కొన్ని రోజుల నుంచి కడుపు నొప్పితో బాధపడేవాడని, కడుపు నొప్పి భరించలేక, శనివారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ పడుకున్నాక దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్‌ఐ వెంకట్రావ్ తెలిపారు. ఆదివారం మృతుడి భార్య బొజ్జ లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. కాగా మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


డోంగ్లి మండలంలో పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

మద్నూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డోంగ్లి మండలం లింబూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్సై విజయ్ కొండ తెలిపారు. అర్ధరాత్రి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం మేరకు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా అక్రమంగా మంజీరా నుంచి ఇసుక రవాణా చేస్తున్న రెండు వాహనాలను పట్టుకొని మద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచామని తెలిపారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

మద్నూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా బిచ్కుంద నుంచి మద్నూర్‌కు తరలిస్తున్న గుట్కా వాహనాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. శ్రీకాంత్ అనే వ్యాపారి అక్రమంగా మద్నూర్‌కు గుట్కాను సరఫరా చేస్తున్నట్లు గుర్తించామని ఆయనపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

రాజంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వనపల్లి, ఆర్గొండ గ్రామశివారులో ఆదివారం పేకాట ఆడుతున్నవారిని అరెస్ట్‌చేసినట్లు ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాటాడుతున్న పక్కా సమాచారంతో స్థావరంపై దాడులుచేయగా ఏడుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.58,350 నగదు, ఏడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

నిజామాబాద్ అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ జిల్లా మహా సభలను పురస్కరించుకొని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పల్ల మల్లేష్, కార్యదర్శిగా కత్తుల మారుతి, జిల్లా కమిటీ సభ్యులుగా సత్యనారాయణ, అనుశవ్వ, నర్సింలు, రజియాబేగం, కనకయ్యలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ఏఐకేఎంకేఎస్ జాతీయ రైతు నాయకులు ప్రసాద్, ఉప్పలయ్య, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో మాధవనగర్ కామ్రేడ్ నర్సన్న కాలనీలో ఉన్న గుడిసెలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఎర్రజొన్న, పత్తి, పసుపు, వరి, చెరకు పంటలకు మద్దతు ధర ఇవ్వాలన్నారు.

సిర్నాపల్లి మహిళకు ఎల్‌వోసీ అందజేత

ఇందల్వాయి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన దిబ్బ రాజమణికి ఆసుపత్రి అత్యవసర ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షల ఎల్‌వోసీ చెక్కును రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి చేతుల మీదుగా దిబ్బ రాజమణికి ఆదివారం అందజేసినట్లు నల్లవెల్లి సొసైటీ చైర్మన్ నోముల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆపదలో ఉన్న సమయంలో రూరల్ ఎమ్మెల్యే స్పందించి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఎల్‌వోసీని అందజేసినందుకు ఎమ్మెల్యే భూపతిరెడ్డికి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రోస్టర్ విధానాన్ని పాటించని టీయూ అధికారులు

● రోస్టర్ విధానం పాటించకుంటే ఆందోళన

డిచ్‌పల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలోని 2012-13 వచ్చిన నోటిఫికేషన్ రోస్టర్ పాయింట్ పాటించకుండా వెనుకబడ్డ తరగతులకు, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగేలా ఇవ్వడం జరిగిందని రాహుల్, వెంకట్‌నాయక్‌లు అన్నారు. అప్పుడు వీసీగా ఉన్న అక్బర్ అలీఖాన్ మరికొంత మందితో కలిసి ఫార్మా కెమిస్ట్రీలో నాన్ సాంక్షన్ పోస్టులను, ఎకనామిక్స్‌లో నాన్ సాంక్షన్ పోస్టులను వాళ్లకు అనుకూలంగా ఉన్నవారికి మార్చుకొని రోస్టర్ పాయింట్ ఎత్తివేయడం జరిగిందన్నారు. 2012-13లో వచ్చిన నోటిఫికేషన్ ద్వారా అప్లై చేసుకోవడం జరిగిందని ఇంటర్వ్యూ కాల్ లెటర్ వచ్చిందని తాను సెలెక్ట్ అయ్యానని కానీ తనకు పోస్టు ఇవ్వలేదని అందులో రోస్టర్ పాయింట్ పాటించకుండా ఎస్టీ రోస్టర్ పాయింట్ చూపించకుండా ఎస్సీ, బీసీ, ఓసీ వాళ్లు ఉన్నప్పటికీ ఎస్సీ, ఎస్టీ రోస్టర్ చూపించకుండా చేశారని అన్నారు. 2012-13 నోటిఫికేషన్‌కు అనుగుణంగా 2014లో కండిషనల్‌గా హైకోర్టు నిర్ణయం మేరకు నియామకమైన అధ్యాపకులకు ప్రమోషన్లపై క్లాస్‌వన్ ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ ఆమోదం నిర్ణయం జరగడాన్ని విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, ప్రజా సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. గతంలో ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్‌లు ఈ ప్రమోషన్ల విషయంపై నిర్ణయం తీసుకోలేదని కానీఇప్పుడు పూర్తి స్థాయి ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్‌లేని సమయంలో నిర్ణయం తీసుకోవడం ఏందో గూడుపుటానికి దారి తీస్తుందని అన్నారు. ఓవైపు విద్యార్థి సంఘాలు విద్యార్థులు అభివృద్ధి కావాలని కోరుతుంటే యూనివర్సిటీలో భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని గగ్గోలు పెట్టిన స్పందించని రిజిస్ట్రార్ యాదగిరి సున్నితమైన విషయంపై ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తూ నిర్ణయం తీసుకోవడం కొసమెరుపు అన్నారు.

23న భారత రాజ్యాంగ రక్షణ సభ

సుభాష్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):ఈనెల 23న భారత రాజ్యాంగ రక్షణ సభ నిర్వహిస్తున్నట్లు మాలమహానాడు జాతీయ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌లు గైని గంగారాం, నీరడి లక్ష్మణ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం నిజామాబాద్ నగరంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. రిజర్వేషన్‌ను నిర్వీర్యం చేయడానికే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. అందుకోసం ఎస్సీలంతా ఒకేవేదికపైకి వచ్చి ఏకం కావాలన్నారు. ఈసభకు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవికుమార్, బహుజన గా యకులు రెంజర్ల రాజేష్, ప్రముఖులు వక్తలు హాజరవుతారని అన్నారు. ఈ సందర్భంగా బోర్గాం నుంచి అంబేద్కర్ భవన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈసభను జిల్లాలోని మాలమహానాడు సభ్యులతో పాటు మాలలంతా హాజరుకావాలని వారు కోరారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మెక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కొచ్చెరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.


కొచ్చెరి మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి
శాంతి - సంక్రాంతికి వస్తున్నాం
దర్శన్ - పుష్ప-2
ప్రియా 70 - డాకు మహారాజ్
ప్రియా 35 - గేమ్ చేంజర్

బాన్సువాడ
మహేశ్వరి - గేమ్ చేంజర్
వేంకటేశ్వర - డాకు మహారాజ్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

